


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

### *కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
### *అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**ఇందిర ఆలోచిస్తోంది** కుర్చీలో కూర్చుని. తనకు పెళ్ళిచెయ్యాలని చూస్తున్నారు తల్లిదండ్రులు. తండ్రి చేస్తున్న ఉద్యోగం తప్ప, అక్కడెక్కడో పల్లెటూళ్ళో ఓ ఇల్లూ, ఐదెకరాల పొలం తప్ప వేరే ఆస్థిలేదు తమకు. తమ కులంలో ఆడపిల్లలకు పెళ్ళికావాలంటే కనీసం ముప్ఫయి నలభయి వేలయినా కట్నం ఇవ్వాలి. ఎక్కడుంది తమ దగ్గర అంతడబ్బు? అప్పు చేయాలి. అప్పుచేస్తే తమ కుటుంబ పరిస్థితి తల్లక్రిందులౌతుంది. అన్నల చదువు, తమ్ముళ్ళ భవిష్యత్తు అంతా గాలికి కొట్టుకుపోతుంది. తాను పెళ్ళి చేసుకోకుండా చదువుకుని ఉద్యోగం చేస్తానని తల్లితో అన్నది. ఆమె నవ్వి 'నీ మొహంలే' అని తన మాటను కొట్టిపారవేసింది ఈ పెద్దవాళ్ళు ఇంతే. తన మూర్ఖత్వము వదలరు. వాళ్ళకి అర్ధంకాదు తమ గొడవ.

మధుబాబుతో పరిచయం గమ్మత్తుగా ఐంది. ఒకసారి అతనితో "ఇంట్లో ఏమీ తోచటంలేదు" అంటే

"నన్ను గురించి ఆలోచిస్తూ ఉండండి మంచి కాలక్షేపం" అన్నాడు.

"ఏముంది మిమ్మల్ని గురించి ఆలోచించటానికి?" అని తానప్పుడు దబాయించింది, కాని ఇప్పుడతని తలపురాకుండా ఒక్క నిమిషం కూడా గడవటల్లేదు. అతను కూడా తనని గురించి ఆలోచిస్తూ వుంటాడా? ఏమో. తనకీ మధ్య బొత్తిగా పాతాలమీద ధ్యాస వుండటంలేదు. జీవితమొక సురభిళసూనం కాదంటాడు మధుబాబు. తనకలా అనిపిస్తోంది. మళ్ళీ అంతలో పెనుగులాట.

తాను అతన్ని ప్రేమిస్తున్నదా? అతడ్ని చూడటం చాలా ఇష్టం. అతనితో మాట్లాడటం, గడపటం, చాలా ఇష్టం. రాత్రిళ్ళు చాలాసేపటివరకూ మేలుకుని అతని గురించి ఆలోచిస్తూ వుంటుంది. అతని తలపులతో బ్రతుకుతోంది. అతనితో ఎన్నో చెప్పాలి అని వుంటుంది, అతని ముఖం, అమాయకంగా చూసే ఆ చిన్న కళ్ళు చూస్తూ ఏమీ చెప్పలేకపోతోంది. మరి దీన్నేమిటంటారు?"

అనవసరంగా తానతని జీవితంలో ప్రవేశిస్తున్నదేమో, అతన్ని బాధిస్తున్నదేమో. ఇందిర ఆలోచనలతో అలసిపోతోంది.

"నేనే నీ పొజిషన్‌లో ఉంటే పరిస్థితుల్ని మరో రకంగా ఉపయోగించుకుందును" అన్నాడు స్నేహితుడు.

"ఎలా?" అనడిగాడు మధుబాబు.

"ఆడపిల్లల్తో అందంగా మాట్లాడుతూ, కలలుగంటూ ఏమీ చేయకుండా విడిచి పెడతావెందుకు? అలా చూడటం గొప్ప అని నువ్వనుకోవచ్చుగాని అది వొట్టి అసమర్థత. మనం యీ భూమ్మీద కొచ్చింది దిగుళ్ళుపడుతూ, రాత్రుళ్ళు మేలుకుని కుములుతూ, కోరికల్ని చంపుకుంటూ నిర్జీవంగా బ్రతకటానికి కాదు. ఎంజాయ్ ఎంట్‌లివ్ టేక్ ఎవ్విరిథింగ్ యీజీ ప్రిన్సిపిల్. యవ్వనమంతా వృధా అనుభూతులతో నింపుకుంటూ, అనుభవాన్ని వదులుకుని ఎందుకీ చిత్రవధ?"

"అలా ఎంత మందిని ఎంజాయ్ చేసి, విడిచి పెడుతూ పోతూంటాం?"

"విసుగు పుట్టేంతవరకూ అవకాశం చేతికొస్తూంటే జారవిడుచుకుని, దానికి బంగారు మెరుగులు దిద్దటము ఫూలిష్‌నెస్. నిత్యసమరం"

"ఆ స్త్రీ అంటే ఇష్టం లేకపోతే?"

"ఇష్టం, అయిష్టం సుఖానికేమీ అడ్డురాదు బ్రదర్."

మధుబాబు ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఇష్టంలేకుండా సుఖం ఎలా సాధ్యం? అంత యాంత్రికంగా జీవించగలడా మనిషి? చూస్తూ చూస్తూ మనకు యిష్టంలేని కూరని బలవంతంగానైనా మిగలేమే. ఇది ఎలా సాధ్యపడుతుంది? నిజమే తనకెన్నో అవకాశాలున్నాయి, వచ్చాయియి. కాని ప్రేమించని మనిషితో యీ అసహ్యాన్ని ఎలా భరించగలడు? వ్యభిచారుల్ని చూస్తే అందుకే అతనికి కోపం, రోత ఏం బావుకుంటున్నారని? ఆత్మవంచన, అనుభూతి లేని అనుభవం, వొట్టి భ్రమ.

రత్నకుమారి ఊళ్ళోలేదు. మరో స్నేహితురాలు సులోచన వచ్చి ఇందిరను వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళింది. వాళ్ళది చాలా పెద్దమేడ. సులోచన బలవంతంమీద తాను అప్పుడప్పుడూ వాళ్ళ ఇంటికి వెడుతూ వుంటుంది. ఈ సులోచనకు అన్నయ్య ఒకడున్నాడు, భాస్కరరావు. తనతో ఏదో ఒకరూపంలో మాటలు పొడిగిస్తూ వుంటాడు. తనకు అతనంటే ఇష్టం ఏమీలేదుగాని ఏముంటాయి మాటలు అతనితో?

"ఇవేళ కారులో భీమ్లీ వెళదాం" అన్నాడు భాస్కరరావు ప్రపోజ్ చేస్తూ.

"అవునన్నయ్యా. చాలాకాలమయింది వెళ్ళి. ఇక్కడే భోంచేసెయ్యవే ఇందూ. ముగ్గురం కలిసి వెళదాం" అంది సులోచన ఉత్సాహంగా.

"నేను రాను" అంది ఇందిర.

భాస్కరరావు ముఖము వివర్ణమైంది. ప్రక్కకి త్రిప్పుకున్నాడు ఏమీ గమనించనట్లుగా.

"ఎందుకురావు" అనడిగింది. సులోచన నవ్వు తెచ్చుకుంటూ.

"రానంతే."

అన్నా చెల్లెళ్ళిద్దరూ తెలతెలబోతూ ఊరుకున్నారు.

ఇందిర వెళ్ళిపోయాక 'మొండిఘటం' అంది సులోచన అన్నతో. ఆమె కంఠంలో కసి ఈర్ష్య ఏమీలేవు.

ఇందిర యింటికి వస్తూ "అతనికేం? మగవాడు. యెంతమంది ఆడపిల్లలతోనయినా తిరగవచ్చు. కాని నా గతియేమవుతుంది?" అనుకుంది.

ప్రొద్దున నిద్రలేచినప్పట్నుంచీ అదోరకంగా వుంది మధుబాబుకు. వంట్లో నలతగా వున్నట్లుంది. కాలేజీకి పోదామనిపించలేదు. మానేశాడు. మధ్యాహ్నానికి జ్వరం వచ్చింది. ఎక్కడకూ కదల్లేకపోయాడు. పనిమనిసి వస్తే బజారునుంచి కాఫీ తెప్పించుకుని తాగాడు. సాయంత్రానికి మరీ నీరసంగా వుంది. స్నేహితులు కూడా ఎవరూ రాలేదు. రాత్రంతా బాధా, ఆలోచనలు.

రెండురోజులు అలాగే జ్వరంతో బాధపడ్డాడు. మూడోనాడు కాస్త నెమ్మదించింది. కొంచెం ప్రశాంతంగా వుంది. సాయంత్రం అయిదవుతోంది. మంచమ్మీదనే పడుకుని ఆ రోజు పేపరు చదువుతున్నాడు.

దగ్గరగా వేసివున్న తలుపుల్ని తీసుకుని లోపలకు వచ్చింది ఇందిర. అతను తలత్రిప్పి చూశాడు.

ఆమె ముఖం వెంటనే కళావిహీనమైంది.

"ఇలా వున్నారేం?" అంది ఆతృతగా దగ్గరకు వస్తూ.

"ఆ కుర్చీ లాక్కుని కూర్చోండి. కొంచెం ఫీవర్ వస్తోంది." అన్నాడు మధుబాబు నెమ్మదిగా.

ఇందిర కుర్చీని అతని మంచానికి చేరువుగా లాక్కుని కూర్చుని "మరి నాకెందుకు కబురు చెయ్యలేదూ?" అంది భేదంగా.

"ఎవరితో?" అన్నాడతను చిరునవ్వుతో.

ఆమె ఉలికిపడింది. అతని ముఖం కేసి దీర్ఘంగా చూస్తూ కూర్చుంది. అందమైన, సుకుమారమైన అతని మోహం చిక్కిపోయి కళాహీనమైవుంది. అలా చూస్తున్నాయి ఆ కళ్ళు. ఆమె దుఃఖం ఆపుకోలేకపోయింది. ఉద్రేకంతో, ఉద్వేగంతో "మధుబాబూ!" అంటూ అతని మంచమ్మీదకు వెళ్ళి కూర్చుని అతని జుట్టులోకి వేళ్ళుపోనిచ్చి "మీరెంత కఠినులు? ఎంత పెంకివారు?" అన్నది కళ్ళలోకి చూసి.

"ఎంత దయ మీకు నామీద?" అన్నాడు మధుబాబు తన సహజశాంత స్వరంతో.

రెండు నిమిషాలు మౌనంగా గడిచాయి. ఇద్దరూ అలాగే ఒకరివంక ఒకరు చూసుకుంటూ గడిపారు.

"నువ్వెవరివి ఇందిరా నాకు? అనడిగాడు మధుబాబు.

"ఎవర్ని?" అని ప్రశ్నించుకుంది. ఆమె ఆలోచన వణికింది. ఏదో చెప్పబోయింది. పెదవి కంపించింది.

ఎవర్ని? నేనెవర్ని?

“చెప్పు ఇందిరా?”

“నేను మీ ప్రియబాంధవినికానా?” అనేసింది ఇందిర ఆవేశంతో వణుకుతున్న కంఠంతో.

అతను అప్రతిభుడయాడు. శరీరం గజగజవణికింది, నిరుత్తరుడైనాడు.

"చెప్పండి. కానా? కానా?" అంటున్నది ఇందిర ఆదుర్దాగా.

"ఏమని జవాబు చెప్పను?" అని ఆలోచిస్తున్నాడు మధుబాబు హఠాత్తుగా కనులు మూసుకుని.

దీపావళి వింత వింతకాంతులు మధుబాబు రోడ్‌మీద వొంటరిగా నడుస్తున్నాడు. ఎటుచూస్తే అటు వెలుగు కళకళ. అందమైన అమ్మాయిలూ అన్నా చెల్లెళ్ళూ, తల్లీకూతుళ్ళూ, భార్యాభర్తలు దీపాలమధ్య చిరునవ్వుల్తో నిలబడి రంగులు వెదజల్లుతున్నారు.

ఎంత సంతోషంగా వుంది ప్రపంచం?

ఒకరికొకరు ఎంత తోడునీడ.

అతనికి ఇందిర జ్ఞాపకం  వచ్చింది. ఏం చేస్తూ వుంటుంది. ఆనాడు వెళ్ళిపోయి మళ్ళీ ఇంతవరకూ కనబడలేదు. కోపం వచ్చిందేమో. అంత హఠాత్తుగా వేసిన ప్రశ్నకు జవాబు చెప్పలేక పోయినాడు. నిశ్చేష్టురాలయి నిశ్శబ్దంగా వెళ్ళిపోయిందామె. తనని అపార్థం చేసుకుందేమో?

తోడు కావాలి తనకు. ఆ తోడు...

"ఇందిర! ఇందిర."

అతను లోలోన వెర్రి కేక వేశాడు. అడుగులు తడబడుతున్నాయి.

పద్మజ రూపంలో తనకు లభించని తోడు, ఇందిర రూపములో లభిస్తోంది. ఎందుకానాడు తన పెదవులు మూతలు పడ్డాయి. "ఇందిరా నువ్వు నా ప్రియబాంధవివే. నువ్వు నాకు కావాలి. నువ్వు లేందే నేను బ్రతుకలేను" అని ఎందుకు చెప్పలేకపోయాడు?

ఎక్కడ కనిపిస్తుందిప్పుడామె? ఆమె కలిసేటంతటి వరకూ ఎలా ఈ ఉద్వేగాన్ని భరించటం?

ఎంత కష్టాన్నయినా ఎంత మందినయినా ఎదిరించి ఆమెని తనదాన్ని చేసుకుంటానని అయ్యో ఎలా చెప్పటం ఆమెతో, ఎంతకాలం వేచి వుండాలి?

"ఏమి చేస్తున్నాడో యిప్పుడు మధుబాబు."

బయట పిల్లలు ఉత్సాహంగా టపాకాయలు కాలుస్తున్నారు. తల్లీ, తండ్రి దగ్గరవుండి కాల్పిస్తున్నారు. ఇందిర తన గదిలో కూర్చుని ప్రశ్న వేసుకుంది.

తాను పెదవిజారి మొన్న తొందరపడిందా? తానంటే అతనికేమీ లేదా? మరి ఎందుకు సరైన సమాధానం చెప్పలేదు? అతను గొప్పవాడు. తనవంటి వాళ్ళు ఎంతమంది అతన్ని ఆరాధించారో? తానంటే ఎందుకు అతనికి ప్రత్యేకత ఉండాలి.

ఇంతలో ఏదో తోచి ఆమె ముఖం వెలవెల పోయింది.

"అవునంటే ఒకవేళ అతను అవునంటే తాను ఏమయేది?"

తాను అతన్నుంచి వాంఛించేదేమిటి? ఏమీలేదు. గ్రుడ్డిగా ఆరాధించింది. అవునంటే తను అతనికి ఏమి అందివ్వగలదు. పెళ్ళిచేసుకోగలదా, అమ్మో తమ కులం కానివాడికి ఇవ్వటానికి తమ ఇంట్లో ఒప్పుకుంటారా? చస్తే ఒప్పుకోరు. ప్రేమించానని అతడ్ని వేధించటం తప్ప తానతనికేమీ చెయ్యలేదు. అతని ఇంట్లో ఒప్పుకోవద్దూ, ఇహ అందర్నీ విడిచిపెట్టి అతనితో ఎక్కడికో వెళ్ళిపోవాలి. అంత సాహసముందా తనకు? లేదు లేదు. తాను చెయ్యలేదాపని. తనకు చేతకాదు,అతడ్ని మరిచిపోవాలి. తనవలన తనికి కష్టం కలగకూడదు.

"ఎక్కడున్నావ్ ఇందూ?" బయటనుంచి సులోచన గొంతు వినిపించింది.

ఆమె గాభరాపడి పమిట చెంగుతో కళ్ళు తుడుచుకుని కుదురుగా కూర్చుంది.

సులోచన లోపలకు వచ్చి ఆశ్చర్యంగా "ఇదేమిటేవ్ బయటంతా సంతోషంగా కేరింతలు కొడుతూవుంటే ఒక్కత్తివీ దిగాలుపడి ఇక్కడ కూర్చున్నావు. బలేదానివి పదపద" అంటూ దగ్గరకొచ్చి చెయ్యిపుచ్చుకుని లాగింది.

"ఎక్కడికి?" అంది ఇందిర తెల్లబోతూ.

"మా యింటికి. సరదాగా గడుపుదాము రావే మొద్దుమొహమా"

కాసేపు అలా పోయివస్తే మనశ్శాంతి లభిస్తుందనిపించింది ఇందిరకు. "పద" అని ముందుకు నడిచింది.

మధుబాబు పాకకొచ్చి "ప్రియబాంధవీ" అని మొదలుపెట్టి ఉత్తరం రాస్తున్నాడు.

"అన్నయ్యా, నువ్వూ మాట్లాడుతూ వుండండి. నేను ఇప్పుడే వస్తాను" అని వాళ్ళిద్దర్నీ మేడమీద వదిలిపెట్టి ఇందిర 'ఆగు సులోచనా' అంటూ పిలుస్తున్నా వినిపించుకోకుండా క్రిందకు దిగిపోయింది సులోచన.

ఇందిర ఇబ్బందిగా సోఫాలో కూర్చుని "ఎట్లా?" అనుకుంటోంది.

భాస్కరరావు రేడియో ఆఫ్ చేసి "ఎందుకు ఇందిరా నన్ను చూస్తే అట్లా బెదిరిపోతావు? నేను వన్యమృగాన్నా?" అన్నాడు యిటు తిరుగుతూ.

ఆమె గుండె గబగబ కొట్టుకుంది. తలవంచుకుని ఆలోచిస్తోంది.

"ఇట్లా ముఖం ఎత్తి నావంక చూడు ఇందిరా. నేను మనిషిగా కనబడటంలేదా?"

ఈ గొంతులో ఆర్ద్రతకు చకితయై ఆమె ముఖం ఎత్తి అతనివంక విస్మయంగా చూసింది. అతనంటే తనకేం అయిష్టంలేదు. ఆకర్షణీయంగా ఉండే మనిషే. ఆత్మ విశ్వాసంగల మనిషిలాకూడా కనిపిస్తున్నాడు.

"నువ్వు లేనిదే నేను బ్రతకలేను ఇందిరా" అతను లేచి ఆమె దగ్గరకు వస్తున్నాడు.

ఇందిరకు భయంగా వుంది.

అతనామె ప్రక్కకు వచ్చి కూర్చుని "నన్ను పెళ్ళిచేసుకోవూ!?" అన్నాడు జాలిగా.

ఆమె నమ్మలేనట్లుగా అతని ముఖంలోకి చూసింది.

"నిజం ఇందిరా. నిన్ను తప్ప నేనెవర్నీ పెళ్ళిచేసుకోను."

ఆమె గబగబా ఆలోచిస్తోంది. ధనికుడు, యువకుడు విధ్యాధికుడు, సాటికులస్థుడు తనంతట తాను వచ్చి అర్థిస్తున్నాడు. అనుకున్నవారు కాకపోయాక ఏం, తనని ప్రేమిచే వ్యక్తి యితను. ఈ విధంగా తన తలిదండ్రుల బర్డెన్ తీర్చగలిగితే తన జన్మకింకేం సాఫల్యం కావాలి"

"జవాబు చెప్పవేం ఇందిరా."

ఆమె గొంతు పెగుల్చుకుని "నేను చాలా బీదదాన్ని. మీ రేటుకి తూగను" అని ముఖం ప్రక్కకి తిప్పుకుంది.

అతనికి బాధ కలిగింది. "ఏం మాటమాట్లాడావు ఇందిరా, నన్నంత అల్పుడిగా భావించావా? ఈ దీపావళి దీపాల వేళ నా మనస్సాక్షిగా చెబుతున్నాను. నాకు కావలసింది నువ్వు. నీ ఆస్థికాదు" అని ఆమె చేతినిపట్టుకుని అందులో తనచేయి వుంచాడు.

ఇందిర నిట్టూర్చింది. తానిప్పుడు బంధితురాలు.

సూర్యాస్తమయం ..ఎర్రని కాంతుల్లో ఇందిర మధుబాబు కెదురుగా వచ్చింది.

"మధుబాబూ!"

"ఏం పనిచేశావు ఇందిరా"

"నన్ను క్షమించండి మధుబాబూ వొట్టి దుర్మార్గురాలిని. మీ మనసు గాయపరిచాను. నన్ను మరిచిపోండి మీరు" అన్నది ఆమె ఏడుస్తూ.

"ఎందుకు మరిచిపోవాలి ఇందిరా?" అన్నాడతను ఆవేశంగా.

"మిమ్మల్ని వంచించాను నేను. పాపిష్టిదాన్ని."

"ఎంత తొందరపడ్డావు. నీకోసం నిన్ను కలుసుకోవటం కోసము ఎలా తపించాను. నీకోసం నా తలిదండ్రుల్నీ, యీ ప్రపంచాన్నీ, సర్వస్వం త్యాగం చేసేవాడిని. నీ భవిష్యత్‌నంతా ఆ ఒక్క నిముషం మీద నిల్పావు. ఎంత చంచులురాలివి ఇందిరా?"

"లేదు మధుబాబూ లేదు. మీరు మౌనంగా వున్న ఆ ఒక్క నిముషం మీదే ఆధారపడలేదు. మీరు అంగీకరించినా, మీలో కరిగిపోయే సాహసము నాలో లేదని తెలుసుకున్నాను, మా కుటుంబాన్ని ఎదిరించే శక్తి నాకు లేదన్న నమ్మకంలోకి వచ్చాను. అందుకే ఈ పని చేశాను. మధుబాబూ, ఇహ నేను అస్వతంత్రురాలిని" జలజలా కన్నీరు కారుస్తోంది.

"నువ్వు అసమర్థురాలివి. పిరికిదానివి. చదివిన చదువును సద్వినియోగం చేసుకోలేని పరమ మూర్ఖురాలివి" అన్నాడు మధుబాబు కసిగా.

ఆమెకు ఆనందం కలిగింది. "మీ ఇష్టం వచ్చినట్లు తిట్టండి మధుబాబూ మీ తిట్లు కూడా మధురంగానే ఉన్నాయి. నేనేం చెయ్యను, నేనేం చెయ్యను?" అతను విహ్వల దృష్టితో ఆమెను చూడసాగాడు.

ఆమె కొంచెం ముందుకు జరిగి "నేనంటే అసహ్యంగా వుందా? ఈ చదువుకున్న మూర్ఖురాలిని చూసి అసహ్యించుకుంటే ఎలా మధుబాబూ జాలిపడాలిగాని..."

అతని గుండె కళుక్కుమంది "వెళ్ళిపో ఇందిరా."

"మిమ్మల్ని ఎలా మరిచిపోయేది మధుబాబూ?" అని ఆమె వెక్కి వెక్కి ఏడవసాగింది.

అతని హృదయం నిర్జీవమైంది.

"మీకేం ఇందిరా, ఏదో ఒక రూపంలో మీ జీవితాలకు స్పష్టత, నిండుతనం ఏర్పడుతున్నాయి, సెటిలైపోతున్నారు. ఏమీ లేకుండా మిగి లిపోయేది నేనే. మీరు వెళ్ళిపోతారు. నేను బిక్కమొహం వేసి అటూ ఇటూ చూస్తాను. అంతా చీకటి. తడుముకుంటూ నడుస్తాను. దాని సరిగ్గా తెలియదు. అలాగే పడుతూ లేస్తూ పోతుంటాను ఒక్కడ్నే.."

కంఠం గడగడా వణికిపోతోంది.

"మధుబాబూ! మధుబాబూ!"

"చీకటి పడుతోంది. వెళ్ళిరా ఇందిరా."

"నన్ను క్షమించారా?"

"నేను చేసినపని సబబయితే తప్పకుండానూ"

"ఇహ కనబడరా?"

"కనబడను."

ఆమె గొంతు మళ్ళీ వినబడలేదు. నిశీధంలో ఆమె రూపం కనబడలేదు.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments